రైతుల ఖాతాల్లోకి డబ్బులు..

- మేడ్చల్ జిల్లాలో 2,799 మంది రైతులకు రూ.15.56 కోట్లు
- రెండో విడతలో 789 మంది రైతులకు రుణమాఫీ రూ.6.15 కోట్లు

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.50 లక్షల లోపు పంట రుణాలు ఉన్న 789 మంది రైతుల ఖాతాల్లో రెండో విడత రుణమాఫీ కింద మంగళవారం రూ.6.15 కోట్లు జమ చేసింది. రెండు విడతల్లో కలిపి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,799 మంది రైతులకు రుణమాఫీ కింద ప్రభుత్వం రూ.15.56 కోట్లను చెల్లించింది. ఇప్పటికే లక్షలోపు రుణాలున్న 2,010 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.9.40 కోట్లు జమ చేసింది. వచ్చే నెలలో రూ.2 లక్షలలోపు రుణాలున్న వారికి మాఫీ చేస్తామని ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు సంబరాలు చేసుకున్నారు.

వినతిపత్రం అందజేత



చెంగిచెర్ల డిపో మేనేజర్ కవితకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కీసర: రాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రతిరోజు చదువు కోసం వస్తున్న కరీంగూడ, చర్లపల్లి ప్రాంతాల విద్యార్థులకు సమయానుకూలంగా బస్సు సౌకర్యం లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల సౌకర్యానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ.. మంగళవారం రాంపల్లి చెందిన యూత్ నాయకులు బండెల పరమేష్, సుభాష్‌గౌడ్ తదితరులు చెంగిచెర్ల డిపో మేనేజర్ కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

మేడ్చల్ టు జవహర్‌నగర్



మేడ్చల్‌లోని డంపింగ్ యార్డు

మేడ్చల్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండటం, శివారు ప్రాంతాల్లోని కాలనీలు వెలియడం, డంపింగ్ యార్డుల నిర్వహణ భారం అధికం కావడంతో నగరానికి చెత్త అడ్డాగా ఉన్న నియోజకవర్గంలోని జహర్‌నగర్‌కు డంపింగ్ యార్డుకు మేడ్చల్ మున్సిపాలిటీ చెత్తను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారుల ఏర్పాట్లు సఫలీకృతమైతే మేడ్చల్ డంపింగ్ యార్డులు లేని పట్టణంగా మారుతుంది. డంపింగ్ యార్డులతో ఉన్న సమస్యలు శాశ్వతంగా తీరుతాయి.

- సఫలమైతే డంపింగ్ యార్డు లేని పట్టణంగా..
- ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్ : పట్టణంలో నిత్యం టన్నుల కొద్ది చెత్తను మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. అత్వెల్లి పరిధిలోని జయదర్శిణి సమీపంలోని ప్రభుత్వ భూముల్లో డంపింగ్ ఏర్పాటు చేసి వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. రైల్వేస్టేషన్ అవతల ప్రాంతంలో మరో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి అక్కడ చెత్త వేస్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తూ.. డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ఆటోలు, ట్రాక్టర్లు పెట్టి చెత్తను సేకరిస్తున్నారు.



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

పంట పొలాలు ఉండటంతో..

అత్వెల్లి డంపింగ్ యార్డు సమీపంలో పంటపొలాలు ఉండటంతో పంటలు దెబ్బ తింటున్నాయి. ఈ డంపింగ్ యార్డుకు వెళ్లేందుకు ప్రైవేటు భూముల నుంచి వెళ్లాల్సి వస్తోంది. భూయజమానులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తరలించడం ప్రధాన సమస్యగా మారింది.

అడిషనల్ కలెక్టర్ సూచనతో...

జిల్లా అడిషనల్ కలెక్టర్ మున్సిపాలిటీలో పర్యటించి డంపింగ్ యార్డులను పరిశీలించడంతో సమస్య బయటపడింది. చెత్తను రిసైక్లింగ్ చేయడం లేదని, అన్ని వసతులున్నా.. ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి సమస్యను వివరించగా.. వ్యర్థాలను జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు.

మరోవైపు రైల్వేస్టేషన్ సమీపంలో..

రైల్వేస్టేషన్ సమీపంలో డంపింగ్ యార్డు ఉండటంతో మూడు నాలుగు కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డంపింగ్ యార్డులో ఆధునిక వసతులు ఉన్నా.. అన్ని వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోవడంతో రైల్వేట్రాక్ అవతలి వైపు ఉన్న కాలనీల చెత్త మాత్రమే అక్కడకు వెళ్తోంది. దీనివల్ల పెద్దగా ప్రయోజనం లేకుండా పోతుంది.

అనుమతిచ్చిన జీహెచ్ఎంసీ..

మేడ్చల్ మున్సిపాలిటీ నుంచి వచ్చే చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డులో డంప్ చేసేందుకు హైదరాబాద్ నగర పాలక సంస్థ అనుమతినిచ్చింది. రవాణా మాత్రం మేడ్చల్ మున్సిపాలిటీ భరించాలని, వాహనాలు తాము ఏర్పాటు చేయలేమని కండిషన్ పెట్టింది.

- మేడ్చల్ మున్సిపల్ అధికారులు చెత్త తరలింపు కోసం జిల్లా, జీహెచ్ఎంసీ అధికారుల అనుమతులు తీసుకున్నారు.

ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు..

జాతీయ రహదారికి సమీపంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి భారీ వాహనాల్లో జవహర్‌నగర్‌కు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు కౌన్సిల్ అమోదం పొందారు. అత్వెల్లి, కిష్టాపూర్, కండ్లకోయ, చెక్‌పోస్ట్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని సేకరించి, మేడ్చల్ నుంచి వచ్చే చెత్తను ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా తరలించి అక్కడ నుండి లారీల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రణాళికలు పూర్తయితే మేడ్చల్‌లో పూర్తిగా డంపింగ్ యార్డు సమస్య తీరుతుంది.

త్వరలోనే తరలిస్తాం..



మేడ్చల్ నుంచి వచ్చే చెత్తను పూర్తిగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు త్వరలోనే తరలిస్తాం. జీహెచ్ఎంసీ, జిల్లా అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నాం. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం చెత్తను ఒకే చోటుకు చేర్చి డంపింగ్ యార్డుకు తరలిస్తాం. త్వరలోనే డంపింగ్ యార్డులేని మున్సిపాలిటీగా మేడ్చల్ మారనుంది.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

సీఎంకు పోస్టు కార్డులు !



పోస్టు కార్డులు పంపుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు

ఘట్‌కేసర్: సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. సీఎంకు పోస్ట్‌కార్డులు పంపించారు. మంగళవారం చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్‌లోని పోస్ట్ ఆఫీస్ వద్ద పోస్ట్‌కార్డులు రాసి పోస్ట్ చేశారు. రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలు సింగరేణి ఉద్యోగులకు అమలు చేయాలని, తెల్లరేషన్ కార్డులు అందజేయాలని, ఆసరా పెన్షన్, అపరిమిత వైద్య సౌకర్యం, ఇంటి స్థలం లేదంటే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు బీరయ్య, రాజయ్య, లక్ష్మీనారాయణ, మల్లయ్య, ప్రభాకర్, రాజనర్సు, రమరాజు, మారుతీరావు, నర్సయ్య, వెంకటయ్య, లక్ష్మణాచార్యులు, నాగేశ్వరరావు, ప్రశాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ‘ ప్రగతి చక్ర ’ పురస్కారాలు



పురస్కారాలతో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది

మేడ్చల్ : తమ విధి నిర్వహణలో సంస్థ విధించిన లక్ష్యాలను చేరుకున్న డ్రైవర్లు, కండక్టర్లకు సంస్థ యాజమాన్యం ప్రగతి పురస్కారాలు అందజేసి సత్కరించింది. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో ఏప్రిల్, మే నెలలో అత్యధిక ప్రోత్సహకాలు సాధించిన కండక్టర్లు, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు, బ్రేక్‌డౌన్ లేకుండా నిర్వహించిన మెకానిక్‌లను డిపో అధికారులు గుర్తించి ప్రగతి చక్ర పురస్కారాలతో సన్మానించారు. డీఎం సుధాకర్, అసిస్టెంట్ డీఎం రామారావు, ఏఈ స్నేహలత, సూపరింటెండెంట్ సత్యనారయణ కార్మికులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్‌క్రైమ్స్ పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై శేఖర్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై శేఖర్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, డ్రగ్ నివారణ, మత్తు పదార్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌సీనగర్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఫోన్‌లో వచ్చిన గుర్తు తెలియని లింకుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం



పున్నమ్మను సన్మానిస్తున్న హెచ్ఎం. పాపిరెడ్డి, వినోద్‌కుమార్

ఘట్‌కేసర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాష స్కూల్ అసిస్టెంట్ అన్నమ్మ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమెను ఘనంగా సన్మానించి ఆమెకు పూలమాల, శాలువాతో సత్కరించారు. హెచ్ఎం. పాపిరెడ్డి, వినోద్‌కుమార్, శ్రీరాములు, మైత్రేయి, కృష్ణమూర్తి, రామ్‌నాథ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకయ్య పాల్గొన్నారు.

మహిళా క్యాంటిన్ పనుల పరిశీలన

సాక్షి,సిటీబ్యూరో: మహిళా క్యాంటిన్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికగుప్తా పరిశీలించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళ స్వయం సహాయక బృందాలతో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటిన్‌లో కొనసాగుతున్న నిర్మాణ పనుల గురించి ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ క్యాంటిన్ల నిర్మాణానికి సంబంధించిన పలు సూచనలు చేయటంతో పాటు పాటించాల్సిన పరిశుభ్రత, రుచికరమైన ఆహారాన్ని అందించడం తదితర విషయాలను అదనపు కలెక్టర్ చర్చించారు. డీఆర్‌డీఏ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరణ బాధితులతో సమావేశం

అభిప్రాయాల సేకరణ



మేడ్చల్: మేడ్చల్ మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి విస్తరణలో తమ ఆస్తులు కోల్పోతున్న వారితో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులు సమావేశమై వారి అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరించారు. మండల తహసీల్దార్ శైలజ, ఆర్డీఓ కార్యాలయం అధికారులు, రహదారుల శాఖ సమావేశంలో పాల్గొని రహదారి విస్తరణపై వివరించారు. బాధితులను ముందుగానే గుర్తించి వారికి నోటీసులు జారీచేసి సమావేశానికి పిలిపించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న మేడ్చల్, అత్వెల్లి, ఎల్లంపేట్ గ్రామాల పరిధిలో దాదాపుగా 9 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. విస్తరణలో మేడ్చల్ పరిధిలో 0.4 హెక్టార్లు, అత్వెల్లి పరిధిలో 1.2 హెక్టార్లు, ఎల్లంపేట్ పరిధిలో 2.1 హెక్టార్ల భూమిని సేకరిస్తున్నట్లు అధికారులు చెప్పారు. పట్టణంలో ముకుంద్ థియేటర్ నుంచి ఎల్లంపేట్ వరకు 75, నుంచి 100 అడుగుల దూరం ఉన్న స్థలాలు సరిపోతాయని అధికారులు స్పష్టం చేశారు.

కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా డిజిటల్ పాఠాలు

జవహర్‌నగర్: కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందిస్తున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శించకూడదని, సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యులు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

అదనపు కలెక్టర్‌ను కలిసిన స్థానిక నేతలు



కీసర: మేడ్చల్‌జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాధికాగుప్తాను మంగళవారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమపథకాల వివరాలను అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా అడిగి తెలుసుకున్నారు. వర్షకాలం నేపథ్యంలో మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశారు. కౌన్సిలర్ బిజ్జశ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలి



చంద్రారెడ్డి

కీసర: పంటరుణాలు తీసుకున్న రైతులకు శరతులు లేకుండా రుణమాఫీ పథకం వర్తింపజేయాలని మేడ్చల్‌జిల్లా బీజేపీ నేత కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నాగారం మున్సిపాలిటీలో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎలాంటి షరతులు లేకుండా పంటరుణాలు తీసుకున్న రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత రుణమాఫీ పథకానికి కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ పథకం వర్తింపచేయకుంటే బీజేపీ పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు



కాప్రా : ప్రభుత్వ భూముల కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని కాప్రా తహసీల్దార్ సుచరిత అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్‌నగర్ ఇందిరమ్మ చెరువు శిఖంను మట్టితో నింపుతూ.. ఆక్రమణలు చేస్తున్నారనే సమాచారంతో కాప్రా తహసీల్దార్ సుచరిత స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలను సిబ్బందితో కూల్చివేయించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కొందరు కబ్జాదారులు ఆక్రమించి పేదలకు నోటరీలు చేసి లక్షల్లో అమ్ముతూ.. ప్రభుత్వ స్థలాలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జవహర్‌నగర్‌లో ఇప్పటికే 20 మంది కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి, సిబ్బంది కాశీరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుడికి విముక్తి

ఘట్‌కేసర్: కూరగాయల దుకాణంలో పనిచేస్తున్న ఓ బాల కార్మికుడిని ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా విముక్తి కల్పించారు. ఆశ్రయ్ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ దాన్వాడ రమేష్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లో మంగళవారం ఆపరేషన్ ముస్కాన్, ఎక్స్ టీమ్‌లో భాగంగా బాలకార్మికుడిని రక్షించారు. తనిఖీలో భాగంగా స్థానిక బస్సు ప్రయాణ ప్రాంగణం సమీపంలోని శ్రీనివాస్ కూరగాయల దుకాణంలో ఓ బాలకార్మికుడు(16)ని గుర్తించారు. సదరు బాలుడు ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాకు చెందినట్లు దుకాణం యజమాని శ్రీనివాస్‌గా ద్వారా తెలిసిందన్నారు. ఈ మేరకు ఆశ్రయ్ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్ ఫిర్యాదు మేరకు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత..



విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



కీసర: ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు చేయూతను అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు సుమారు 400 మందికి బీజేపీ నేతలు మామిడి జంగారెడ్డి, సూర్యశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్ పటేల్, జూపల్లి నరేష్, సతీష్‌రెడ్డి, గంద్ర కమలాకర్, వల్లాల శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, వాసిరెడ్డి నాగమల్లేశ్వర్‌ల సాయంతో విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేశారు. చెంగిచెర్ల డిపో మేనేజర్ కవిత, వెంకటేష్ ఎస్ఎల్. రామరాజు, చక్రపాణి, పాఠశాల హెచ్ఎం వనజరాంరెడ్డి, పీఈటీ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పలు పరికరాలను అందజేశారు. విద్యార్థులు ఆడుకోవడానికి జారుడు బండ, బెల్ట్, టై పంపిణీ చేశారు. స్థానిక కౌన్సిలర్ రమాదేవి, ట్రస్ట్ సభ్యులు సుందర్‌రావు, వీరారెడ్డి, శ్రీకాంత్, సోమయ్య, కృష్ణ, ఆనంద్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనం..

మేడ్చల్: ప్రభుత్వం చేపట్టిన ‘ధితి భోజన్’ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మేడ్చల్ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు కలిసి భోజనాలు వడ్డించారు. పాఠశాల ఆవరణలో వండిన భోజనాన్ని అందరూ కలిసి పిల్లలకు పెట్టి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు పాఠశాలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ వసంతకుమారి .ఉపాధ్యాయులు మంజుల, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రత్నాలయంలో చోరీ నిందితుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

శామీర్‌పేట్ : పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితులను శామీర్‌పేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి మంగళవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ గ్రామానికి చెందిన నీలపు నీలయ్య అలియాస్ అనిల్ (24), స్క్రాప్ దుకాణం నిర్వహిస్తుంటాడు. అతడి మిత్రుడు మేడ్చల్ ప్రాంతానికి చింతాడ శ్రీను (22), క్యాటరింగ్ పనిచేస్తుంటాడు. వీరిద్దరూ చిన్నప్పటి నుంచి పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. చెడు వ్యసనాలకు అలవాటైన వీరు నగరంలోని రాంనగర్‌లో స్క్రాప్ వ్యాపారం నిర్వహించే మహ్మద్ అస్లామ్ అలీతో స్నేహాన్ని ఏర్పరచుకుని వారు దొంగిలించిన సొమ్మును అతడికి విక్రయించేవారు. ఈ మేరకు శామీర్‌పేట, మేడ్చల్, జినోమ్‌వ్యాలీ, పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు చోరీలకు పాల్పడగా.. 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. కాగా 23న అర్ధరాత్రి అలియాబాద్ రత్నాలయంలో చోరీకి పాల్పడి బంగారు, వెండి, పంచలోహ విగ్రహాలతో పరారయ్యారు. కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఆధారాలతో ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈనెల 29న సాయంత్రం 4.30 గంటల సమయంలో మునీరాబాద్ వద్ద నిందితులు దొంగిలించిన ఆభరణాలను అలీకి విక్రయిస్తుండగా.. పట్టుబడ్డారు. విచారణలో నేరం అంగీకరించారు. నిందితుల నుండి బంగారు లాకెట్‌తో పాటు రూ.7 లక్షల విలువైన వెండి, పంచలోహ ఆభరణాలు, రూ.80 వేల నగదు, 4 సెల్ ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు షరీఫ్ పరారీలో ఉన్నట్లు సమాచారం. మొత్తం 13 కేసుల్లో రూ.70 లక్షల విలువైన సొమ్మును చోరీ చేశారని, పూర్తి దర్యాప్తు చేసి వివరాల వెల్లడిస్తామని డీసీపీ తెలిపారు.

రైతుల ముఖాల్లో సంతోషం నింపడమే లక్ష్యం

- రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్
- బ్యాంకర్లు రైతులకు వెంటనే పంట రుణాలు అందజేయాలి



రుణమాఫీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: పంట రుణమాఫీతో రైతుల ముఖాల్లో సంతోషం నింపడమే కాకుండా, రైతు కుటుంబాలను ఆర్థికంగా పటిష్ఠ పరచడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రైతు రుణమాఫీ రెండో విడతలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో రైతురుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ ,అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, డీఏఓ మేరీరేఖతో కలిసి రుణమాఫీ చెక్కులను రైతులకు అందజేశారు. రుణమాఫీ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వచ్చే రబీ, ఖరీఫ్ సీజన్లలో అధిక పంటలు పండించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు.

- మొదటి విడతలో జూలై 18న రూ.లక్ష వరకు ఉన్న పంట రుణాలను సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం రెండో విడత రుణమాఫీలో రూ. లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు చెక్కులు అందజేస్తున్నామన్నారు. సాంకేతిక కారణాల వల్ల పంట రుణమాఫీ జరగకపోతే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌లో వివరాలు తెలుసుకుని, రుణమాఫీ కాని పక్షంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు.
- మాఫీ జరిగిన రైతులకు వెంటనే పంటలకు అవసరమైన రుణాలను అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజరుతో సహా బ్యాంకర్లను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అందించే ఆర్థిక చేయూత ఉపయోగకరమని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందన్నారు. రుణమాఫీ మొత్తం లోన్ అకౌంట్లలో పడకపోతే ఆందోళన చెందకుండా వ్యవసాయ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తా మాట్లాడుతూ.. మూడో విడతలో మిగిలిన వారందరికీ రుణమాఫీ జరుగుతుందని వివరించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రేఖామేరి, మున్సిపల్ చైర్మన్లు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.